# ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్‌కు రంగం సిద్ధం



## పురుషుల టైటిల్ పోరుపై ఆసక్తి

**పారిస్, జూన్ 7 :** ప్రతిష్ఠాత్మకమైన ఫ్రెంచ్ ఓపెన్ 2026 తుది అంకానికి చేరుకుంది. పారిస్లోని రోలాండ్ గారోస్ వేదికగా జరుగుతున్న ఈ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో నేడు పురుషుల సింగిల్స్ ఫైనల్ మ్యాచ్ జరగనుండగా, మహిళల విభాగంలో ఇప్పటికే కొత్త ఛాంపియన్ అవతరించింది. పురుషుల సింగిల్స్ విభాగంలో జర్మనీ స్టార్ ఆటగాడు అలెగ్జాండర్ జ్వెరెవ్, ఇటలీకి చెందిన యువ సంచలనం ఫ్లావియో కొబాలి మధ్య టైటిల్ పోరు జరగనుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 6:30 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఫైనల్‌పై టెన్నిస్ అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఇద్దరూ తమ కెరీర్‌లో తొలి ఫ్రెంచ్ ఓపెన్ సింగిల్స్ టైటిల్‌ను గెలుచుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు. మరోవైపు మహిళల సింగిల్స్ విభాగంలో రష్యా యువ క్రీడాకారిణి మిరా అంద్రీవా చరిత్ర సృష్టించింది. ఫైనల్‌లో పోలాండ్‌కు చెందిన మయా ఖ్వాలిన్స్కాపై 6–3, 6–2 తేడాతో వరుస సెట్లలో విజయం సాధించి తన కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. కేవలం 19 ఏళ్ల వయసులోనే గ్రాండ్‌స్లామ్ ట్రోఫీని గెలుచుకున్న మిరా అంద్రీవా ప్రదర్శన టెన్నిస్ ప్రపంచాన్ని ఆకట్టుకుంది. క్లేకోర్టుపై ఆమె కనబరిచిన ఆధిపత్యం భవిష్యత్తులో మరిన్ని విజయాలకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక నేడు జరిగే పురుషుల ఫైనల్‌లో ఎవరు విజేతగా నిలుస్తారన్నది ప్రపంచ టెన్నిస్ అభిమానుల్లో ఉత్కంఠ రేపుతోంది. జ్వెరెవ్ అనుభవం గెలుస్తుందా, లేక కొబాలి యువ జోరు చరిత్ర సృష్టిస్తుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఆఫ్ఘన్‌పై భారత్ భారీ స్కోర్

## గిల్, రాహుల్ సెంచరీలతో ఇన్నింగ్స్ డిక్లేర్



**న్యూ చండీగఢ్, జూన్ 7 :** న్యూ చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్ వేదికగా ఆఫ్ఘనిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో భారత బ్యాటర్లు పరుగుల వరద పారించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కేఎల్ రాహుల్ అద్భుత సెంచరీలతో రాణించగా, సాయి సుదర్శన్, రిషభ్ పంత్, వాషింగ్టన్ సుందర్ కీలక అర్ధశతకాలతో మెరవడంతో టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 8 వికెట్ల నష్టానికి 564 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. తొలి రోజు నుంచే దూకుడుగా ఆడిన భారత బ్యాటర్లు ఆఫ్ఘన్ బౌలర్లకు ఎలాంటి అవకాశం ఇవ్వలేదు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 177 బంతుల్లో 126 పరుగులు చేసి జట్టుకు భారీ పునాది వేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. మరోవైపు కేఎల్ రాహుల్ కూడా శతకంతో ఆకట్టుకుని జట్టు స్కోరును మరింత బలోపేతం చేశాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన సాయి సుదర్శన్ 81 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. వికెట్ కీపర్ రిషభ్ పంత్ కూడా తన సహజ దూకుడు ప్రదర్శిస్తూ 81 పరుగులు సాధించాడు. చివర్లో వాషింగ్టన్ సుందర్ 52 పరుగులతో అజేయంగా నిలిచి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. ఆఫ్ఘనిస్థాన్ బౌలర్లలో సలీమ్ సాఫి ఒంటరి పోరాటం చేశాడు. అతడు ఏకంగా 6 వికెట్లు పడగొట్టి భారత బ్యాటర్లను కొంతమేర ఇబ్బంది పెట్టాడు. రెహమాన్ షరీఫీ, హష్మతుల్లా షాహిదీ తలో వికెట్ దక్కించుకున్నారు. అయితే బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై ఓపెనర్ యశస్వి జైస్వాల్ మాత్రం అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. సలీమ్ సాఫి బౌలింగ్‌లో 24 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఔటై నిరాశపరిచాడు. భారీ స్కోరు సాధించిన భారత్ ఇప్పుడు బౌలింగ్‌లోనూ అదే ఆధిపత్యాన్ని కొనసాగించి ఆఫ్ఘనిస్థాన్‌ను త్వరగా ఆలౌట్ చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. 564 పరుగుల భారీ స్కోరుతో భారత్ మ్యాచ్‌పై పూర్తి పట్టు సాధించినట్లు కనిపిస్తోంది.

# కెప్టెన్‌గా గిల్ అరుదైన ఘనత




**న్యూ చండీగఢ్, జూన్ 7 :** అఫ్ఘానిస్థాన్‌తో జరుగుతున్న ఏకైక టెస్టు మ్యాచ్‌లో అద్భుత శతకంతో చెలరేగిన భారత టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. 126 పరుగుల విలువైన ఇన్నింగ్స్ ఆడిన గిల్, టెస్టు క్రికెట్ చరిత్రలో అత్యంత విజయవంతమైన కెప్టెన్–బ్యాటర్ల జాబితాలో చోటు సంపాదించాడు. అతడి టెస్టు కెరీర్‌లో ఇది 11వ శతకం కాగా, కెప్టెన్‌గా సాధించిన ఆరో సెంచరీ కావడం విశేషం. ఈ ఇన్నింగ్స్‌తో గిల్ టెస్టుల్లో కెప్టెన్‌గా వెయ్యి పరుగుల మైలురాయిని కూడా అధిగమించాడు. ప్రస్తుతం అతడి ఖాతాలో కెప్టెన్‌గా 1076 పరుగులు ఉన్నాయి. కేవలం 15 ఇన్నింగ్స్‌ల్లోనే ఆరు శతకాలు నమోదు చేసిన గిల్, భారత టెస్టు కెప్టెన్లలో అత్యధిక సెంచరీలు చేసిన ఆటగాళ్ల జాబితాలో ప్రముఖ స్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ జాబితాలో విరాట్ కోహ్లి 20 శతకాలతో అగ్రస్థానంలో ఉండగా, సునీల్ గవాస్కర్ 11, మహ్మద్ అజారుద్దీన్ 9, సచిన్ టెండూల్కర్ 7 శతకాలతో గిల్ కంటే ముందున్నారు. ఇదే సమయంలో గిల్ మరో అరుదైన రికార్డును కూడా నమోదు చేశాడు. టెస్టు క్రికెట్‌లో కెప్టెన్‌గా వెయ్యి లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన ఆటగాళ్లలో అత్యుత్తమ బ్యాటింగ్ సగటు కలిగిన రెండో ఆటగాడిగా నిలిచాడు. ప్రస్తుతం కెప్టెన్‌గా గిల్ బ్యాటింగ్ సగటు 82.8గా ఉంది. ఈ జాబితాలో ఆస్ట్రేలియా దిగ్గజం డాన్ బ్రాడ్‌మన్ మాత్రమే 101.5 సగటుతో గిల్ కంటే ముందున్నాడు. శ్రీలంక దిగ్గజం కుమార సంగక్కర 69.6, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్ 68.1, శ్రీలంక మాజీ సారథి మహేలా జయవర్ధనే 59.1 సగటులతో తదుపరి స్థానాల్లో ఉన్నారు. ఈ గణాంకాలు గిల్ కెప్టెన్సీలో బ్యాటింగ్ ఎంత స్థిరంగా, ప్రభావవంతంగా సాగుతుందో స్పష్టం చేస్తున్నాయి. చిన్న వయసులోనే భారత టెస్టు జట్టుకు నాయకత్వం వహిస్తున్న గిల్, తన బ్యాటింగ్‌తో పాటు కెప్టెన్సీలోనూ ప్రత్యేక ముద్ర వేస్తున్నాడు. అఫ్ఘానిస్థాన్‌పై సాధించిన ఈ శతకం అతడి కెరీర్‌లో మరో మైలురాయిగా నిలవడంతో పాటు, భారత క్రికెట్ భవిష్యత్ నాయకుడిగా అతడిపై ఉన్న నమ్మకాన్ని మరింత బలపరిచింది.




# టీజీ20 లీగ్‌కు రెడీ

## వేలంలో తిలక్ వర్మకు రూ.33 లక్షల భారీ ధర

**హైదరాబాద్, జూన్ 7:** తెలంగాణ యువ క్రికెటర్ల ప్రతిభను ప్రోత్సహించాలనే లక్ష్యంతో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 క్రికెట్ లీగ్‌కు రంగం సిద్ధమైంది. టోర్నీకి సంబంధించిన ఆటగాళ్ల వేలం ప్రక్రియ ఆదివారం రామోజీ ఫిల్మ్ సిటీలో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ క్రికెట్ వ్యాఖ్యాత చారు శర్మ ఆధ్వర్యంలో వేలం నిర్వహించగా, లీగ్‌లో పాల్గొంటున్న ఎనిమిది ఫ్రాంచైజీలు ఆటగాళ్ల కోసం పోటీపడ్డాయి. వేలంలో భారత యువ క్రికెటర్ తిలక్ వర్మకు అత్యధిక ధర పలికింది. రూ.5 లక్షల కనీస ధరతో వేలంలోకి వచ్చిన తిలక్ కోసం మెదక్ ఫాల్కన్స్, పాలమూరు స్ట్రైకర్స్ మధ్య హోరాహోరీ పోటీ నెలకొంది. మధ్యలో నల్గొండ జట్టు కూడా బిడ్డింగ్‌లో చేరడంతో ధర వేగంగా పెరిగింది. చివరకు మెదక్ ఫాల్కన్స్ రూ.33 లక్షల భారీ మొత్తానికి తిలక్ వర్మను సొంతం చేసుకుంది. టీజీ20 లీగ్ వేలంలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ధర ఇదే కావడం విశేషం. జట్టు బడ్జెట్‌లో సగానికి పైగా మొత్తాన్ని తిలక్ వర్మ కోసం మెదక్ ఫాల్కన్స్ వెచ్చించింది. దీంతో టోర్నీలో అతనిపై ప్రత్యేక దృష్టి నెలకొంది.

# టీ20 జట్టుకు అయ్యర్ సారథ్యం

**ముంబై, జూన్ 7:** భారత టీ20 క్రికెట్ జట్టుకు కొత్త కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ ఎంపిక కావడంతో భారత క్రికెట్‌లో కొత్త అధ్యాయానికి నాంది పలికింది. రానున్న ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలతో పాటు 2026 ఆసియా క్రీడల్లోనూ జట్టుకు ఆయన నాయకత్వం వహించనున్నారు. ఈ నేపథ్యంలో ముంబై టీ20 లీగ్‌లో జరిగిన మ్యాచ్ అనంతరం స్పందించిన అయ్యర్, తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన భారత క్రికెట్ నియంత్రణ మండలికి కృతజ్ఞతలు తెలిపారు.

భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం ప్రతి క్రికెటర్‌కు గర్వకారణమని, అలాంటి దేశ జట్టుకు నాయకత్వం వహించే అవకాశం దక్కడం తనకు ఎంతో ప్రత్యేకమని అయ్యర్ పేర్కొన్నారు. ఆటగాడిగా పరుగులు సాధించడం ఎంత ఆనందాన్నిస్తుందో, కెప్టెన్‌గా జట్టును విజయాల బాట పట్టించడం అంతకంటే ఎక్కువ సంతృప్తిని ఇస్తుందని అన్నారు. తన కెరీర్ మొత్తం అభిమానులు చూపించిన ప్రేమ, ప్రోత్సాహం వల్లే ఈ స్థాయికి చేరుకున్నానని, వారి ఆదరణకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని తెలిపారు. ఇదిలా ఉండగా కెప్టెన్సీ మార్పుపై భారత జట్టు ప్రధాన ఎంపికల కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ వివరణ ఇచ్చారు. భవిష్యత్ టీ20 ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక నాయకత్వాన్ని సిద్ధం చేయాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సూర్యకుమార్ యాదవ్‌ను సారథ్య బాధ్యతల నుంచి తప్పించడం సులభమైన నిర్ణయం కాదని, అయితే జట్టు భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మార్పు చేయాల్సి వచ్చిందని వివరించారు. అన్ని ఫార్మాట్లలోనూ శ్రేయస్ అయ్యర్ నిలకడగా రాణిస్తున్నాడని, అతడిలో నాయకత్వ లక్షణాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అగార్కర్ పేర్కొన్నారు. జట్టును ముందుండి నడిపించే సామర్థ్యం, ఒత్తిడి పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకునే నైపుణ్యం, సహచర ఆటగాళ్లను ప్రోత్సహించే తత్వం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని అతడికి ఈ కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. ఇప్పుడు భారత టీ20 జట్టును విజయపథంలో నడిపించాల్సిన బాధ్యత అయ్యర్‌పై ఉంది. కెప్టెన్‌గా తన సామర్థ్యాన్ని నిరూపించుకోవడంతో పాటు రాబోయే అంతర్జాతీయ సిరీస్‌లు, ఆసియా క్రీడలు వంటి కీలక టోర్నీల్లో జట్టుకు విజయాలు అందించాలనే లక్ష్యంతో ఆయన ముందుకు సాగుతున్నారు. భారత క్రికెట్ అభిమానులు కూడా కొత్త సారథి నాయకత్వంలో జట్టు మరిన్ని విజయాలు సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



